గుంతల రోడ్డుపై ప్రయాణం ఎలా?


రోడ్డుపై ఏర్పడిన గుంత


బీటీ కొట్టుకుపోయిన చోట నింపిన మట్టి

- కంకరతేలి దర్శనమిస్తున్న రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మల్హర్ : మండలంలోని చిన్నతూండ్ల నుంచి పెద్ద తూండ్ల క్రాస్ వరకు నిర్మించిన లింక్ (అంతర్గత) బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నతూండ్ల ఆ రెవాగు వంతెన నుంచి పెద్దతూండ్ల సబ్‌స్టేషన్ వరకు పలు చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 సంవత్సరంలో మల్లారం నుంచి పెద్దతూండ్ల క్రాస్ (సబ్‌స్టేషన్) వరకు రూ. 9 కోట్లతో వంతెనతో పాటు సింగిల్ బీటీ రోడ్డు నిర్మించింది. ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో ప్రయాణం చేస్తారు. అలాగే వ్యవసాయ పనుల నిమిత్తం ఈ రహదారి గుండా రైతులు వెళ్తుంటారు. పెద్ద పెద్ద గుంతలు, కంకర తేలినరోడ్డుపై రాకపోకలు పెద్ద సమస్యగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. అలాగే గతంలో వచ్చిన వరదల కారణంగా రెండు, మూడు చోట్ల బీటీ కొట్టుకుపోయింది. బీటీ కొట్టుకుపోయిన చోట అధికారులు మట్టి నింపి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిస్తే చాలు ప్రయాణం ప్రమాదకరంగా ఉంటుందని వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.60 లక్షలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు పీఆర్ అధికారులు తెలుపుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



చిన్నతూండ్ల ఆరెవాగు వంతెన నుంచి పెద్దతూండ్ల క్రాస్ వరకు ఉన్న బీటీ రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

– పులిగంటి మల్లేశ్, చిన్నతూండ్ల, మల్హర్

స్టే విధించడానికి అగ్రవర్ణాలే కారణం

- కాటారం డివిజన్ బీసీ ఐక్య వేదిక నాయకులు తిరుపతి, మైనర్‌బాబు


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కాళేశ్వరం : తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఆనందంలో బీసీలంతా ఉన్న సందర్భంలో జీఓ నంబర్ 9పై హైకోర్టు స్టే విధించడానికి ప్రధాన కారణం అగ్రవర్ణాలేనని కాటారం డివిజన్ బీసీ ఐక్య వేదిక నాయకులు సముద్రాల తిరుపతి, నిడిగొండ మైనర్‌బాబు అన్నారు. మహదేవపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో శుక్రవారం వారు మాట్లాడుతూ బీసీలపై అగ్రవర్ణాలు, పాలకులు చేస్తున్న కుట్రలో భాగమేనన్నారు. కేంద్రంతో మాట్లాడి పార్లమెంట్‌లో చట్టం చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. గతంలో బీసీ రిజర్వేషన్ పరిధి 50 శాతం ఉన్నప్పటికీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో చేసిన చర్యగా భావిస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ కోసం ప్రభుత్వ బిల్లు గవర్నర్ ఆమోదం పొందకుండానే జీఓ విడుదల చేయడం హైకోర్టు స్టే ఇవ్వడానికి ప్రధాన కారణమైందన్నారు. దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, బీసీలకు సమన్యాయం చేయాల్సి ఉంటుందని అన్నారు. బీసీలపై అక్కసుతో రెడ్డి జాగృతి నేతలు మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డిలు చేసిన దుశ్చర్యలను ఏకకంఠంతో ఖండిస్తున్నామన్నారు. మళ్లీ ఇచ్చిన మాట ప్రకారంగా రిజర్వేషన్ ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తే న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక సీనియర్ నాయకులు స్వామి యాదవ్, కారెంగుల బాపురావు, తడకల జగదీష్, శ్రీపతి బాపు, జాగృతి మహేష్, చాగర్ల రవీందర్, కన్నెబోయిన ఐలయ్య, మధూకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌పీ ఆధ్వర్యంలో రాస్తారోకో


అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న టీఆర్‌పీ నాయకులు

భూపాలపల్లి రూరల్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందేనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జిల్లా నాయకుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా పార్టీ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద రాస్తారోకో చేశారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు బీసీలపై చిత్తశుద్ధి లేదని, 42 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలు తమ ద్వంద్వవైఖరిని ప్రకటిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను అణిచివేయడానికి పెద్ద మొత్తంలో పోలీసులను మోహరించి ఉద్యమాన్ని అణిచివేసే విధంగా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. రవాణా స్తంభించిపోవడంతో పోలీసులు పార్టీ నాయకులను అదుపులోకి తీసుకొని వదిలేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మడిపల్లి శ్యాంబాబు మాదిగ

భూపాలపల్లి రూరల్ : భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఈ నెల13న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు, ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, పార్టీలతో పాటు అనుబంధ సంఘాల నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకుల నోముల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ బీఆర్.గవాయ్‌పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై దాడిగా చూడడం జరుగుతుంద అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

మొగుళ్లపల్లి : సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సునీత అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ 20 సంవత్సరాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే మండలంలోని మొగుళ్లపల్లి, మొట్లపల్లి పాఠశాలలో సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో బంద్


షాపులను బంద్ చేయిస్తున్న నాయకులు

మంగపేట: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు సంఘం నాయకులు మండల కేంద్రంలో బీసీ కులసంఘాల ఆధ్వర్యంలో వ్యాపార వాణిజ్య సంస్థలు, షాపులను శుక్రవారం బంద్ చేయించి నిరసన తెలిపారు. సుమారు రెండు గంటల అనంతరం అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు, షాపులు తెరుచుకోవడంతో లావాదేవీలు యథావిధిగా కొనసాగాయి. కార్యక్రమంలో బీసీ సంఘం మండల ఇన్‌చార్జ్ గాదె శ్రీనివాసాచారి, పెరక సంఘం మండల నాయకులు దంతెనపెల్లి నరేందర్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడెల నరేష్, ఓడబలిజ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కలాల రాంబాబు, ఓడబలిజ సంఘం నాయకులు ఎర్రావుల రమేష్, గగ్గూరి మహేష్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు గుగ్గిళ్ల సురేష్, బీసీ సంఘం నాయకులు దాగం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకుమట్ల : మండలంలోని దుబ్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, హాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. విద్యార్థులకు సరైన భోజనం అందించాలని పేర్కొన్నారు అంగన్‌వాడీ టీచర్ విజయ, వరుణ, పద్మ, శైలజ, ఆయాలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


కాటారం : వినయ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాలమహానాడు, కాంగ్రెస్ నేతలు


చిట్యాల : ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

కాటారం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంతకాని వినయ్ కుటుంబాన్ని మాలమహానాడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం వేర్వేరుగా పరామర్శించారు. వినయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మాలమహానాడు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో జాతీయ మాలమహానాడు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుగుల రాజన్న, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు పొట్ట పోశయ్య, మంచినీళ్ల రాజబాబు, బోడ రాజు, పంతకాని మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు గద్దె సమ్మిరెడ్డి, భూపెల్లి రాజు, ఆత్మకూరి కుమార్‌యాదవ్, కుమ్మరి రమేష్, మారుపాక రాజేంద్రప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

చిట్యాల : మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కనుకుంట్ల ప్రమీల ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుమారుడు హరీష్‌తో 2009–10 పదో తరగతి చదువుకున్న మిత్రులు హాజరై మృతిరాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో మిత్రులు గోపగాని నరేశ్, లవన్‌బాబు, రమేశ్, శరత్, చైతన్యగుప్తా, నాగరాజు, ప్రభాకర్, ప్రవీణ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి పవన్ కల్యాణ్


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్ కల్యాణ్ అన్నారు. మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. దోమల బారిన పడకుండా దోమతెరలను వినియోగించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ కోటిరెడ్డి, సిబ్బంది ధనలక్ష్మి, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్లతో రైతుల ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా ఏలేటిరామయ్యపల్లి, కైలాపూర్ లింకురోడ్డు

చిట్యాల : మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామం నుంచి కైలాపూర్, కొలాపూర్ నుంచి నవాబుపేట ఎస్సీ కాలనీ, నవాబుపేట ఎస్సీ కాలనీ నుంచి చింతకుంట రామయ్యపల్లి, చింతకుంట రామయ్యపల్లి నుంచి శాంతినగర్ శివారు వరకు రైతులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గతంలో లింకురోడ్డును ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టకపోవడంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా పోయాయి. కాగా ప్రతీ ఏడాది రోడ్ల నిర్మాణాలకు అనేక నిధులు కేటాయిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఇప్పటి వరకు సరైన రోడ్ల నిర్మాణం చేపట్టిన దాఖలాలు లేవు. అలాగే కైలాపూర్ నుంచి నవాబుపేట ఎస్సీ కాలనీ వరకు బీటీ నిర్మాణం చేస్తామని ప్రజాప్రతినిధులు ఎన్నో మాటలు చెప్పారు. అలాగే నవాబుపేట ఎస్సీ కాలనీ నుంచి చింతకుంటరామయ్యపల్లి గ్రామ శివారు వరకు కొంత మేరకు బీటీ రోడ్డు పోసి మిగతాది మట్టి రోడ్డుతోనే సరిపెట్టారు. దీంతో వర్షాకాలంలో వాహనదారులు, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. అలాగే చింతకుంట రామయ్యపల్లి నుంచి శాంతినగర్‌కు వెళ్లేందుకు కోట్లాది రూపాయల నిధులతో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం కొట్టుకుపోయింది. దీంతో రైతులు ద్విచక్ర వాహనం, ఎండ్ల బండ్లపై వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లింకురోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని వాహనదారులు, రైతులు వేడుకుంటున్నారు.

బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి



ఏలేటిరామయ్యపల్లి నుంచి కైలాపూర్‌కు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– ఏలేటి రాజు, ఏలేటిరామయ్యపల్లి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుమన్‌రెడ్డి

వెంకటాపురం(ఎం): ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించాలని ములుగు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అందుగులమీది గ్రామంలో జరిగిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. అనంతరం లక్ష్మీదేవిపేటలో ఇటీవల మరణించిన అరుణ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, మేకల రాజేష్, గణేష్, శ్యామ్, రాజు, వెంకటస్వామి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

షీ టీం చర్యలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సమ్మలాల్

మంగపేట: మండలంలోని కమలాపురం ఆదర్శ హైస్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం షీ టీం చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ జిల్లా ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ సమ్మలాల్ ఆధ్వర్యంలో పలు అంశాలను వివరించారు. మహిళలు, యువతులు తమ భద్రత కోసం ఎవరినీ సహాయం కోరవచ్చనే విషయంపై అవగాహన కల్పించారు. 181 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం తీసుకోవచ్చని, ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో టీ సేఫ్ యాప్‌ను ఎలా ఉపయోగించాలనే విషయాన్ని వివరించారు. విలువలతో కూడిన జీవితం గడపడం ద్వారా కుటుంబం, సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, వాటి నుంచి ఎలా బయటపడాలనే విషయంపై విద్యార్థులకు వివరించారు. సైబర్ నేర బాధితులు 1930 నంబర్‌కు వెంటనే ఫోన్‌చేసి సహాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో షీటీమ్స్ సభ్యులు బి.స్వాతి, కె.బాలకృష్ణ, ఎండీ. మిరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మచ్చాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు


దొంగలు పడేసిన ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్ డబ్బాలు

గోవిందరావుపేట: మండల పరిధిలోని మచ్చాపూర్ గ్రామంలో దొంగలు రెచ్చిపోతున్నారు. మధ్యాహ్నం రెక్కీ చేసి రాత్రి వేళ వ్యవసాయ క్షేత్రాల్లో చోరీలకు తెగబడుతున్నారు. మచ్చాపూర్‌కు చెందిన రైతు దరిపెల్లి సమ్మయ్య పొలంలో ఉన్న 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు అపహరించారు. అందులోని కాపర్ వైర్, ఆయిల్‌ను పూర్తిగా దొంగిలించారు. ప్రధానంగా జాతీయ రహదారులకు, రోడ్లకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు దుండగుల టార్గెట్‌గా మారుతున్నాయి. కేవలం కాపర్, ఆయిల్ కోసం దొంగలు ఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను వదలడం లేదు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం : మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాటారం ట్రాన్స్‌కో ఏడీఏ నాగరాజు, ఏఈ ఉపేందర్ తెలిపారు. కాటారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఏ, ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

కాటారం : బీజేపీ, బీఆర్ఎస్‌లకు బీసీ రిజర్వేషన్లపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు జావీద్‌ఖాన్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల ఐక్యతను మెరుగుపర్చడం న్యాయమైన వాటాను అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కట్టుబడి ఉండగా ఒక్క విపక్ష పార్టీ కూడా మద్దతు ఇవ్వలేదని జావీద్‌ఖాన్ విమర్శించారు. హై కోర్టు రిజర్వేషన్ల అమలుపై ఇటీవల స్టే విధించడంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంబురాలు చేసుకోవడం దురదృష్టకరమని విమర్శించారు.

ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

మల్హర్ : మండలంలోని కొయ్యూరు గ్రామంలో (ఎస్పీఎం) ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు సెంటర్ ఏర్పాటుపై మాజీ ఎంపీపీ మల్హల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్హల్‌రావు మాట్లాడుతూ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటి మరమ్మతులకు రైతులు దూరప్రాంతాలైన కాటారం, జంగేడు, రేగొండ చిట్యాలకు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ఎస్పీఎం ఏర్పాటుకు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. రిపేరు సెంటర్ ఏర్పాటు చేయించిన మంత్రి శ్రీధర్‌బాబుకు మండల రైతులు పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మెగా వైద్యశిబిరం

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలలో తుమ్మ కోమల, సాయిరెడ్డి, జయసింహారెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాజీ వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, తుమ్మ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బుక్కులు, పెన్నులు, మహిళలకు చీరెలను అందించనున్నట్లు తెలిపారు. ఆయుర్వేదం, అద్దాలు, చర్మ వ్యాధులు, రక్తపరీక్షలు, ఎముకలు, థైరాయిడ్, కేన్సర్ వంటి వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి మందులు అందించనున్నట్లు వెల్లడించారు.

పండ్ల పంపిణీ



ములుగు: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలోని రోగులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేందర్ మాట్లాడుతూ మనిషి తన ఆలోచనలు, భావోద్వేగాలను నియంత్రించుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో మానసికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్ఎంఏ ప్రేమ్ సింగ్, వలంటీర్లు బాబు, ఖిర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

వాజేడు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో శుక్రవారం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలకు బాకీ పడిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మాయమాటలు చెప్పి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగకుండా ముఖ్య మంత్రి అడ్డుపడుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో గుమ్మడి దొడ్డి మాజీ సర్పంచ్ పాయం జయలక్ష్మి, పాయం జానకి రమణ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.